

ఆక్రమణలపై ఫిర్యాదులు

శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ స్పందనలో ఆక్రమణలు, ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. IIలో



సుస్థిర అభివృద్ధి వైపు విశాఖ

న్యూఢిల్లీలో విజ్ఞాన భవనంలో జరుగుతున్న జాతీయ విపత్తుల నివారణ సదస్సులో ఆంధ్రప్రదేశ్ యూఎల్‌బీల తరపున మేయర్ హరి వెంకటకుమారి హాజరయ్యారు. IIలో



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీతమ్మధార ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ మనోజ్‌తో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని. పాల్గొన్న కేకే రాజు, వైఎస్సార్‌సీపీ నేతలు.

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ రవినాథ్ తిల్‌హరి దంపతులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్‌హరి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

శారదాపీఠంలో దేవదాయశాఖ మంత్రి



స్వామీజీలతో మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

సింహాచలం (పెందుర్తి) : విశాఖ శ్రీ శారదాపీఠాన్ని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. రాజశ్యామల అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిలను కలిసి, ఆశీస్సులు తీసుకున్నారు. గతనెలలో శారదాపీఠం పర్యవేక్షణలో కురుక్షేత్రలో జరిగిన లక్ష చండీ మహా యజ్ఞం వివరాలను, ప్రాశస్త్యాన్ని పీఠాధిపతులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. అఖండ భారతావనిలోనే తొలిసారి చేపట్టిన లక్ష చండీ మహా యజ్ఞాన్ని విజయవంతంగా పర్యవేక్షించిన విశాఖ శ్రీశారదాపీఠం పేరు ప్రఖ్యాతులు వైదిక చరిత్రలో సుస్థిరంగా నిలుస్తాయని ఈ సందర్భంగా మంత్రి అన్నారు.

ఆలిండియా ఇంటర్ వర్సిటీ కిక్‌బాక్సింగ్ రిఫరీగా సుమన్



గాజువాక : ఉత్తర ప్రదేశ్‌లోని జాన్‌పూర్‌లో ఈ నెల 14 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ పోటీలకు రిఫరీగా గాజువాకకు చెందిన కోచ్ సుమన్ ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహక కమిటీ నుంచి సుమన్‌కు ఆహ్వానం అందింది. ఈ పోటీల్లో రిఫరీలుగా పాల్గొనేందుకు దేశంలోని తొమ్మిది మందిని ఎంపిక చేయగా, ఏపీ నుంచి సుమన్‌కు అవకాశం దక్కింది.









మాక్ పోలింగ్, కౌంటింగ్: విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కోసం మాక్ పోలింగ్, కౌంటింగ్ నిర్వహించారు. ఓటింగ్ కంపార్ట్‌మెంట్ల తయారీ, బ్యాలెట్ బాక్సుల తరలింపు, బ్యాలెట్ పేపర్ల లెక్కింపు తదితర దృశ్యాలివి..

క్లైమాక్స్‌కు ప్రచారపర్వం
పోలింగ్‌కు సిద్ధం

- నేటి సాయంత్రం 4 గంటలతో ప్రచారం బంద్
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ
- బూత్‌ల వారీగా సామగ్రి పంపిణీ



ఎన్నికల ఏర్పాట్లను సమీక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి మల్లికార్జున, కమిషనర్ శ్రీకాంత్

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం శనివారం సాయంత్రం 4 గంటలతో ముగియనుంది. ఇప్పటికే ఆయా పార్టీల మద్దతు అభ్యర్థులతో పాటు స్వతంత్రులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. చివరి రోజు కావడంతో.. మరోసారి అన్ని ప్రాంతాల్లోనూ మద్దతుదారులతో జోరుగా ప్రచారం నిర్వహించేందుకు వ్యూహరచన చేసుకున్నారు. మరోవైపు ఈనెల 13న పోలింగ్‌కు అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు దాదాపు పూర్తి చేసింది. సిబ్బందిని పూర్తిస్థాయి సుశిక్షితులను చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

శనివారం సాయంత్రం 4 గంటలకు ఉత్తరాంధ్ర జిల్లాలు నిశ్శబ్దంగా మారనున్నాయి. సార్వత్రిక ఎన్నికల స్థాయిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కూడా పలువురు అభ్యర్థులు జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13న ఉదయం 8 గంటలకు పోలింగ్ మొదలు కానుంది. సాయంత్రం 4 గంటలలోపు పోలింగ్ స్టేషన్లలోనికి వచ్చిన వారికి మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనుమతించనున్నారు. మరోవైపు ఎన్నికల కమిషన్ తరపున సచివాలయ ఉద్యోగుల ద్వారా ఓటరు స్లిప్పులు పంపిణీ సజావుగా నిర్వహిస్తున్నారు. వీరితో పాటు పార్టీల వారీగా తమ మద్దతు అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వెయ్యాలని అభ్యర్థిస్తూ.. ఓటర్లకు స్లిప్పుల పంపిణీ కార్యక్రమాలు కూడా జోరుగా జరుగుతున్నాయి. ఆయా జిల్లాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలకు ఇప్పటికే ఎన్నికల మెటీరియల్ తరలింపు ప్రక్రియను దాదాపు పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున, ఏఆర్‌వో, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పోలింగ్ కేంద్రాలకు ఒక అభ్యర్థి తరపున ఒక పోలింగ్ ఏజెంట్‌ను మాత్రమే అనుమతించారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ..

ఈ నెల 13వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జేసీ కేఎస్ విశ్వనాథన్‌తో కలిసి ఎన్నికల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోనల్ అధికారులు పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వారి వారి జోన్లలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు, పోలింగ్ సిబ్బంది టీమ్‌లు సకాలంలో పోలింగ్ బూత్‌కు చేరేలా పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లను సమన్వయపర్చాలన్నారు. రిటర్నింగ్ అధికారికి పోలింగ్ పర్సంటేజ్‌ను టైమ్ టు టైమ్ తెలియజేయాలన్నారు. పోలీసు అధికారులు పోలింగ్ జరిగే సమయంలో బూత్‌ల లోపలికి వెళ్లకూడదని సూచించారు. అవసరమైతే పోలింగ్ అధికారి సూచనల మేరకు మాత్రమే పోలీస్ అధికారులు పోలింగ్ బూత్‌లో స్పందించాలని స్పష్టం చేశారు. పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలపై పోలీసు అధికారులతో సమీక్షించినట్లు స్పష్టం చేశారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ తదితర టీమ్‌లను ఏర్పాటుచేసి వారి విధుల గురించి వివరించామన్నారు. ఏజెంట్లు, ఓటర్లు ఓటింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు తీసుకొని రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల జోనల్ అధికార్లు, పోలింగ్ అధికార్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీసీపీ సునీల్ సుమిత్ గరుడ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌కు కాపుల మద్దతు



కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. వేదికపై మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ, పార్టీ శ్రేణులు

మద్రిపాలెం(విశాఖ ఉత్తర): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు కాపులంతా మద్దతు తెలిపారు. బిర్లా జంక్షన్‌లోని బొత్స కన్వెన్షన్‌లో శుక్రవారం కాపుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తమ పార్టీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపుల పక్షపాతని పేర్కొన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఏవిధంగా కాపులను గుండెల్లో పెట్టుకుని చూసుకున్నారో.. అంతకంటే ఎక్కువగా నేడు ముఖ్యమంత్రి జగన్ వారికి ప్రాధాన్యమిస్తున్నారని, భవిష్యత్తులో కూడా మరింతగా కొనసాగుతుందన్నారు. గతంలో వైఎస్సార్ కుటుంబం.. కాపు నాయకులంతా కుటుంబ సభ్యుల్లా మెలిగేవారని, అదే సంప్రదాయంతో జగన్ మోహన్‌రెడ్డి కాపులను ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. కాపు సామాజిక వర్గానికి సంబంధించి పలు అంశాలతోపాటు కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లు లేవని వైవీ సుబ్బారెడ్డి దృష్టికి నాయకులు తీసుకెళ్లగా.. ఆయన స్పందించి తప్పకుండా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రభుత్వ చీఫ్ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కార్పొరేటర్లు, కాపు సామాజిక వర్గం పెద్దలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మైనార్టీల సమావేశంలో పాల్గొన్న ముస్లింలు



‘లెఫ్ట్’తో టీడీపీ డీల్..!

IIలో

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో లెఫ్ట్‌తో చట్టాపట్టాలు
- ప్రాధాన్యత ఓటుపై కుదిరిన ఒప్పందం
- ఓటమి భయంతో అడ్డదారులు
- పీడీఎఫ్ అభ్యర్థికి రెండో ఓటు వేసేలా పచ్చ నేతల బహిరంగ ఒప్పందం
- టీడీపీ అభ్యర్థికి రెండో ప్రాధాన్యత ఓటు వేసేందుకు పీడీఎఫ్ ఓకే
- జనసేన నేతలకు ఇప్పటికే ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం

అబ్బురపరిచేలా నగరాన్ని తీర్చిదిద్దండి

సీడీఎంఏ ప్రవీణ్‌కుమార్

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): ప్రపంచ దేశాలకు సైతం దిక్సూచిగా సూచిస్తున్న విశాఖ నగరాన్ని, జీ-20 సదస్సుకు విస్తున్న ప్రతినిధులను అబ్బురపరిచేలా విశాఖ నగరాన్ని సుందరీకరించి, నగర అభివృద్ధికి జీవీఎంసీ చేపట్టిన ప్రాజెక్టులను విపులంగా వివరించాలని సీడీఎంఏ ప్రవీణ్‌కుమార్ అధికారులకు సూచించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ చాంబర్లో కమిషనర్ పి.రాజాబాబు, ఇతర అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగరాభివృద్ధి దృష్ట్యా ప్రజల సౌకర్యార్థం ఇప్పటికే చాలా ప్రాజెక్టులు జీవీఎంసీ అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అందులో 24 గంటల తాగునీరు, విద్యుత్ ఆదా చేస్తూ సోలార్ లైటింగ్, ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు, వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర ప్రాజెక్టుల వివరాలు జీ-20 సదస్సు ప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. ఆర్కేబీచ్ నుంచి ర్యాడిసన్ బ్లూ హోటల్ వరకు ఏర్పాటు చేస్తున్న సీవ్యూ పాయింట్‌ల వద్ద ప్లాంటేషన్, సుందరీకరణ, పారిశుద్ధ్యం, విద్యుత్ అలంకరణ, పార్కింగ్, వెండింగ్ జోన్ తదితర అన్ని సదుపాయాలతో ప్రణాళిక ప్రకారం కూడిన సూచిక ప్రదేశాలు సుందరీకరించాలని ఆదేశించారు. ఈ నెల 22 నాటికి పనులు పూర్తి చేయలని ఆదేశించారు. సమావేశంలో ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, గ్రీన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఘనంగా సీఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరిస్తున్న పోర్టు చైర్మన్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో కైలాసపురంలోని సీఐఎస్‌ఎఫ్ న్యూకాంప్లెక్స్ పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం సీఐఎస్‌ఎఫ్ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి పోర్టు చైర్మన్ కె. రామమోహనరావు ముఖ్య అతిథిగా విచ్చేసి, సీఐఎస్‌ఎఫ్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ పరిశ్రమల రక్షణ కోసం సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది అందిస్తున్న సేవలను ప్రశంసించారు. తమ విధులలో ఉత్తమ ప్రతిభ కనబరచిన జవాన్లకు చైర్మన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. పరేడ్ గ్రౌండ్‌లో పచ్చదనం పెంపొందించే దిశగా పోర్టు చైర్మన్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దూబె, పోర్టు చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ స్వామి, సీఐఎస్‌ఎఫ్ పోర్టు యూనిట్ సీనియర్ కమాండెంట్ విజయ్‌కుమార్, సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు కూడా వన్డే టిక్కెట్ల విక్రయాలు

విశాఖ స్పోర్ట్స్ : ఈనెల 19న విశాఖలో జరగనున్న భారత్–ఆస్ట్రేలియా మ్యాచ్‌కు ఆన్‌లైన్ టిక్కెట్ల విక్రయాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అయితే తొలి రోజు కొన్ని టిక్కెట్లనే పలు డినామినేషన్లలో విక్రయించారు. మిగిలిన టిక్కెట్లను శనివారం, ఆదివారం కూడా పేటీఎం ఇన్‌సైడర్.ఇన్ వెబ్‌సైట్‌ద్వారా విక్రయించనున్నారు.

డాక్‌యార్డ్‌లో పారిశ్రామిక భద్రతపై వర్క్‌షాప్



చంద్రశేఖర్‌వర్మను సత్కరిస్తున్న రియర్ అడ్మిరల్ సంజయ్‌సాధు

సింధియా: నేవల్ డాక్‌యార్డ్‌లో శుక్రవారం పారిశ్రామిక భద్రతపై వర్క్‌షాప్ నిర్వహించారు. తూర్పు నావికాదళంలోని వివిధ విభాగాల నుంచి సుమారు 300 మంది పాల్గొనగా, నేవీ సేఫ్టీ ఆర్గనైజేషన్, హెచ్‌ఎస్‌ఎల్, విశాఖ స్టీల్‌ప్లాంట్, ఎల్‌అండ్‌టీ డిఫెన్స్, కోరమండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఆంధ్రప్రదేశ్ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ డి. చంద్రశేఖరవర్మను నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ రియర్ అడ్మిరల్ సంజయ్‌సాధు సత్కరించారు.

హెచ్3ఎన్2పై వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం

మహారాణిపేట: దేశంలో కొత్త రకం ఫ్లూ హెచ్3ఎన్2 వైరస్ వ్యాప్తి నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. కేజీహెచ్, అంటు రోగుల ప్రభుత్వ ఆస్పత్రి, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పడకలు సిద్ధం చేశారు. సంబంధిత వైద్యులు కూడా అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. జ్వరం, తలనొప్పి, దగ్గు, జలుబుకు అవసరమైన మందులను కూడా సిద్ధంగా ఉంచారు. బాధితులకు పరీక్షలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వలంటీర్లు ఇంటింటి సర్వే కూడా చేపట్టారు.

- జ్వరంతో బాధపడుతూ కేజీహెచ్‌కు వచ్చే రోగులకు జనరల్ ఫిజీషియన్ వైద్యులు సేవలు అందిస్తున్నారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. కొద్ది రోజుల నుంచి ఓపీకి ఎక్కువగా జ్వరం, దగ్గు, తల, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న రోగులు వస్తున్నారన్నారు. దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు ఉన్నవారు జాగ్రత్తలు తీసుకుని, వైద్యులను సంప్రదించాలని సూచించారు.
- జ్వరాల వ్యాప్తిపై వలంటీర్లు డోర్ టూ డోర్ సర్వే చేస్తున్నారు. బాధితుల నుంచి రక్తం శాంపిల్స్ సేకరించి పరీక్షల కోసం పంపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ సర్వే చురుగ్గా సాగుతోంది.

తాళ్లవలసలో బెంగాల్ వాసి ఆత్మహత్య

తగరపువలస: భీమిలి మండలం తాళ్లవలస బీపీసీఎల్ పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం చెట్టుకు ఉరేసుకుని పశ్చిమ బెంగాల్లోని మొండాల్ పరా ప్రాంతానికి చెందిన కాంచల్ మోండాల్ అనే వ్యక్తి మృతి చెందాడు. పెట్రోల్ బంకు సిబ్బంది 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి మృతుని జేబులో లభించిన కార్డుల ఆధారంగా ఫోన్ చేయగా అతని చిరునామా తెలిసింది. బంకు ప్రతినిధి కె.కృష్ణవెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ తాతారావు దర్యాప్తు చేస్తున్నారు.

'లెఫ్ట్'తో టీడీపీ డీల్..!

సాక్షి, విశాఖపట్నం : గడిచిన కొన్నేళ్ల కాలంగా ఏ ఒక్క ఎన్నికలోనూ ఒంటరిగా పోటీ చేసే ధైర్యం టీడీపీ చెయ్యడం లేదు. ఇప్పుడు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే తీరును అవలంబిస్తోంది. ఓవైపు వైఎస్సార్‌సీపీ ప్రచారంలో దూకుడు ప్రదర్శించడంతోపాటు.. విజయం దిశగా పయనిస్తుందనే ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో ఓటమి తప్పదని తెలిసి.. టీడీపీ అడ్డదారులు వెతుక్కుంటోంది.

నియమనిబంధనలను, విలువలను తుంగలో తొక్కుతూ ఇతర పార్టీలతో ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. లెఫ్ట్‌పార్టీలు కూడా అదేబాటలో పయనించడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. ప్రాధాన్యత వరుసకు సంబంధించిన పీడీఎఫ్, టీడీపీ రాజీ బేరాలు కుదుర్చుకుంది. ఒకరికొకరు సహకరించుకునే ఒప్పందం బహిర్గతమవ్వడంతో నీతిమాలిన రాజకీయాలను గ్రాడ్యుయేట్స్ విమర్శిస్తున్నారు.

సింగిల్‌గా పోటీ చేసే ధైర్యం లేక..

సర్పంచ్ ఎన్నికల నుంచి సార్వత్రిక ఎన్నికల వరకూ ఎక్కడా సింగిల్‌గా సైకిల్ వెళ్లిన దాఖలాలు కనిపించడంలేదు. ఎన్నికలు ఏదైనా ఓటమి చవిచూస్తున్న టీడీపీకి ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల ఓటమి భయం పట్టుకుంది. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి ప్రతి ఓటరు గడపకు వెళ్లి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే అంతర్గత సర్వేలో ఓటమి తప్పదని తెలుగుదేశం పార్టీకి అవగతమైంది. ఈ నేపథ్యంలో ఏ చిన్న అవకాశం దొరికినా విలువల్ని మరిచి మరీ గెలుపు మాట పక్కన పెట్టి.. తన ప్రత్యర్థి విజయం సాధించకూడదన్న లక్ష్యంతో దొడ్డిదారులు అన్వేషించుకుంటోంది. ఇటీవలే ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్లను ప్రలోభపెట్టేందుకు టీడీపీ మద్దతు అభ్యర్థికి చెందిన లక్షలాది రూపాయలు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న విషయం విదితమే. డబ్బులు కుమ్మరించి ఓటర్లను గాలమేసేందుకు ఓవైపు ప్రయత్నాలు చేస్తూనే మరోవైపు వామపక్షాలతో లోపాయికారీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సార్వత్రిక ఎన్నికల మాదిరిగా కాకుండా ప్రాధాన్యత సంఖ్యలతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపోటములు మారే అవకాశాలున్నాయి. అందుకే ఆ దిశగా టీడీపీ, వామపక్షాలు మిలాఖత్ అయ్యాయి. రెండు రోజుల క్రితం విజయవాడలో టీడీపీ, వామపక్షాలకు చెందిన కీలక నేతలు సమావేశమై ఇరు పార్టీలు ఒకరికొకరు సహకరించుకునేందుకు పరస్పర అంగీకరించుకున్నారు. తమ పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతివ్వాల్సిందిగా టీడీపీని లెఫ్ట్ పార్టీలు కోరాయి. రెండో ప్రాధాన్యత ఓటును పీడీఎఫ్ అభ్యర్థికి వేసేందుకు టీడీపీ నేతలు అంగీకరించారు. అదేసమయంలో.. తమ రెండో ప్రాధాన్యత ఓటుని టీడీపీ మద్దతు అభ్యర్థికి వేసేందుకు వామపక్షాలు సంసిద్ధత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఎన్నికల ఫలితాల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో స్పష్టత రాకపోతే రెండో ప్రాధాన్యత ఓటు ద్వారా కూడా విజయం సాధించవచ్చనే వ్యూహంతో టీడీపీ వామపక్షాలతో చెట్టపట్టాలేసుకుంది.

ఈ విషయమై ఇప్పటికే.. తమ ఓటర్లకు టీడీపీ, వామపక్షాలు సమాచారం అందించి.. రెండో ఓటుపై క్లియర్‌గా చెబుతుండటం విశేషం. కాస్తో కూస్తో విలువలు పాటించే వామపక్షాలు కూడా టీడీపీ మాదిరిగా వ్యవహరించడాన్ని రాజకీయ వర్గాలు చీదరించుకుంటున్నాయి. టీడీపీ, వామపక్షాల ఒప్పందంపై ఓటర్లుగా ఉన్న పట్టభద్రులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు మార్గాలను అనుసరించి.. రాజకీయాలను భ్రష్టు పట్టించేందుకు చేస్తున్న వ్యవహారాలపై విమర్శలు చేస్తున్నారు. లెఫ్ట్ పార్టీలు కూడా ఈ ఒప్పందానికి ఓకే చెప్పడం.. వారి దిగజారుడుతనానికి నిదర్శనమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఆడలేక.. అదిగో వెండి అంటూ..

ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుగా.. విజయావకాశాలు సన్నగిల్లుతుండటంతో టీడీపీ నేతలకు ఏం చెయ్యాలో తెలీక వైఎస్సార్‌సీపీపై బురద జల్లే ప్రయత్నాలు ప్రారంభించింది. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వెండితో కూడిన బహుమతులు ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ క్యాంపు కార్యాలయంలో వేల సంఖ్యలో ఉన్నాయంటూ కొందరు టీడీపీ కార్యకర్తలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జునకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు బీచ్ రోడ్డులో ఉన్న సుధాకర్ క్యాంపు కార్యాలయం సమీపంలో మేజిస్టిక్స్ టవర్స్ లోని 101, 105 ఫ్లాట్స్‌లో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, మహారాణిపేట తహసీల్దార్ ఆనంద్ కుమార్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి నేతృత్వంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓటరు స్లిప్పులు, కరపత్రాలు మాత్రమే లభించాయి. ఓటర్లను మభ్యపెట్టేందుకు ఎలాంటి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించడం లేదని అధికారులు రూఢీ చేసుకొని నివేదికను రిటర్నింగ్ అధికారికి పంపించారు. ఏదో ఒక విధంగా అప్రతిష్టపాలు చేసేందుకు టీడీపీ చేసిక కుట్రలు భగ్నమవ్వడంతో ఆ పార్టీ నేతలకు ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. మరోవైపు టీడీపీతో అంటకాగుతున్న పీడీఎఫ్ ప్రతినిధులు ఈ విషయాన్ని రచ్చ చేసేందుకు నానాయాగీ చేశారు. సోషల్ మీడియాల్లో తప్పుడు ప్రచారాలకు తెరతీశారు. అక్కడ జరిగింది తెలుసుకొని పలాయనం చిత్తగించారు.

సీఎంఆర్ నగల షోరూం ప్రారంభం


షోరూం ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

సీతమ్మధార(విశాఖ ఉత్తర): ఆశీల్‌మెట్ట రోడ్డులో సీఎంఆర్ నూతన నగల షోరూంను వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ లాంటి వాణిజ్య సంస్థల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఇటువంటి సంస్థలు మరిన్ని ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు. సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తొలిసారిగా బంగారు ఆభరణాల ఎక్స్‌క్లూజివ్ షోరూంను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రారంభోత్సవంలో భాగంగా డబుల్ ధమాకా ఆఫర్‌గా గ్రాము బంగారంపై రూ.200 వరకు క్యాష్‌బ్యాక్, అంతేకాక ఎంత బంగారం కొనుగోలు చేస్తే అంత వెండి ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే చిర్ల జగ్గారెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, పైడా విద్యా సంస్థల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, లక్కీ షాపింగ్ మాల్ అధినేత స్వామి, హోటల్ మేఘాలయ ఎండీ సురేష్.. మావూరికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చందన బ్రదర్స్ వ్యవస్థాపకుడు చందన మోహన్‌రావు, సీఎంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి బాలాజీ, సీఎంఆర్ జనరల్ మేనేజర్ లింగమూర్తి పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి వైపు విశాఖ పయనం

జాతీయ విపత్తుల నివారణ సదస్సులో మేయర్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): న్యూఢిల్లీలో విజ్ఞాన భవనంలో జరుగుతున్న జాతీయ విపత్తుల నివారణ సదస్సులో ఆంధ్రప్రదేశ్ యూఎల్‌బీల తరఫున విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి హాజరయ్యారు. ఈ సదస్సును ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సముద్ర తీరాన ఉన్న విశాఖ నగరం విపత్తులను తట్టుకుని, సుస్థిర అభివృద్ధి వైపు పయనించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ ప్రయత్నంలో ప్రభుత్వ అధికారులు, ఎన్జీవోస్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్, మీడియా ప్రతినిధులు, నగర ప్రజల సహకారం అవసరమన్నారు. ఈ సదస్సులో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, యూనియన్ హోంశాఖ సెక్రటరీ అజయ్‌కుమార్ బల్ల, రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, విపత్తుల నిర్వహణ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉమెన్ ఫుట్‌బాల్ విజేత కడప

- రన్నర్సప్‌గా గుంటూరు, తూర్పుగోదావరి

విశాఖ స్పోర్ట్స్: ఏపీ సీనియర్ మహిళా ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా వైఎస్ఆర్ కడప జట్టు నిలిచింది. ఇక్కడి రైల్వేస్టేడియంలో శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో కడప 6–0గోల్స్ తేడాతో గుంటూరు జిల్లా జట్టుపై విజయం సాధించింది. ఏపీ ఉమ్మడి జిల్లాలు ఈ టోర్నీలో తలపడగా మూడో స్థానానికి జరిగిన పోటీలో విశాఖ జిల్లా జట్టుపై తూర్పుగోదావరి జిల్లా జట్టు విజయం సాధించింది. దీంతో రన్నరప్‌గా గుంటూరు జట్టు నిలవగా, సెకండ్ రన్నరప్‌గా తూర్పుగోదావరి జిల్లా జట్టు నిలిచింది. పోటీల ముగింపు కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కె.గోపాలకృష్ణ విజేతలకు ట్రోఫీలందించారు.

ఐఐఏఎం డైరెక్టర్ వేధింపులపై విద్యార్థుల ఆందోళన


ఐఐఏఎం ప్రధాన ద్వారం ఎదుట నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ(విశాఖ తూర్పు): ఎంవీపీ కాలనీలోని ఇంటిగ్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్(ఐఐఏఎం) యాజమాన్యం తీరుపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. కళాశాల డైరెక్టర్, ఇతర సిబ్బంది వేధిస్తున్నారంటూ శుక్రవారం ప్రధాన ద్వారం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ కొంత కాలంగా ఐఐఏఎం డైరెక్టర్ సావిత్రి జయంత్ తమను వేధిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థినులను అసభ్య పదజాలంతో తిట్టడంతో పాటు బాడీ సేమింగ్‌కు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ద్వంద్వ వైఖరి మాటలతో అవమానిస్తున్నారని పలువురు విద్యార్థినులు ఆరోపించారు. అంతే కాకుండా చిన్నపాటి కారణాలతో మిడ్ ఎగ్జామ్స్ రాయనీయకుండా ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. పీజీడీఎం విద్యార్థుల నుంచి రెండేళ్లకు రూ.3 లక్షల ఫీజును నాలుగు దఫాలుగా వసూలు చేస్తామని ప్రవేశాల సమయంలో చెప్పారని, అయితే ఇందుకు విరుద్ధంగా ఇప్పుడే అంతా ఫీజు చెల్లించాలంటూ వేధించడం తగదన్నారు. ఫీజుల వ్యవహారంతో పాటు డైరెక్టర్ వేధింపుల విషయాన్ని పలుమార్లు యాజమాన్య ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఆందోళన చేస్తున్న ఓ విద్యార్థిని కళ్లు తిరిగి పడిపోవడంతో తోటి విద్యార్థులు సపర్యలు చేశారు. డైరెక్టర్ వేధింపుల విషయాన్ని ఎంవీపీ పోలీసులకు 20 మంది వరకు విద్యార్థులు గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై పోలీసులు ఎలాంటి విచారణ చేపట్టలేదని విద్యార్థులు చెప్పారు. శుక్రవారం సైతం పరీక్షలు ఉండగా డైరెక్టర్ కళాశాలకు రాలేదన్నారు. దీంతో పరీక్షలు రాయలేకపోయామని వాపోయారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని విద్యార్థులు కోరారు.

ఆక్రమణలు, ఉల్లంఘనలపై ఫిర్యాదులు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీలో శుక్రవారం నిర్వహించిన టౌన్‌ప్లానింగ్ స్పందనలో ఆక్రమణలు, ఉల్లంఘనలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయి. జోన్–3 పరిధి పెదవాల్తేర్, దొండపర్తి ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. జోన్–4 పరిధిలో కూడా యథేచ్ఛగా సాగుతున్న అనధికారిక కట్టడాలకు అడ్డుకట్ట వేయాలని వినతిపత్రం అందజేశారు. జోన్–5 తాటిచెట్లపాలెం వద్ద ఎటువంటి సెట్‌బ్యాక్స్ లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ఫిర్యాదు అందింది. మురళీనగర్‌లో బిల్డింగ్ బైలా ప్రకారం నిర్మాణాలు జరగడం లేదని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. జోన్–6లో గిరిజన కాలనీ, సత్తివానిపాలెంలో అనధికార నిర్మాణాలపై అధికారులకు దృష్టికి పలువురు స్థానికులు తీసుకెళ్లారు. ఆక్రమణలు, అనధికారిక నిర్మాణాలు, భవన నిర్మాణ వ్యర్థాలపై టోల్‌ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు తెలిపారు.

'పదోన్నతుల్లో బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్ల అమలు'


మాట్లాడుతున్న వకుళాభరణం కృష్ణమోహన్

మద్రిపాలెం(విశాఖ ఉత్తర): బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల నేత డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ అధ్యక్షతన శుక్రవారం మాధవధారలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఓబీసీ ఉద్యోగ సంఘాల సమాఖ్య, ఆల్ ఇండియా ఓబీసీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓబీసీ రిజర్వేషన్ల అమల్లో బ్యాక్‌లాగ్ విధానం తేవాలన్నారు. నాన్ క్రిమిలేయర్ పరిమితిని రూ.20లక్షలకు పెంచాలని కోరారు. సామాజిక, ఆర్థిక కుల గణన 2011 వివరాలను రాష్ట్రాల వారీగా అధికారికంగా వెల్లడించాలన్నారు. దేశంలోనే ఎక్కువ జనాభా కలిగిన ఓబీసీలను కేంద్రం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. విద్య, ఉద్యోగ సంస్థల్లో కేంద్రం అమలు చేస్తున్న 27 శాతం రిజర్వేషన్లకు ప్రతి ఏటా కనీసం 15శాతం అభ్యర్థులు కూడా రావట్లేదన్నారు. అభ్యర్థులు రాకపోతే బ్యాక్‌లాగ్ విధానం ద్వారా ప్రత్యేక డ్రైవ్‌లతో నియామకాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కనకమహాలక్ష్మి సన్నిధిలో హైకోర్టు జడ్జి


హైకోర్టు జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హరీకి ప్రసాదం అందిస్తున్న ఏఈవో రాంబాబు

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): కనకమహాలక్ష్మి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హరీ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఆయనకు స్వాగతం పలికిన ఆలయ అధికారులు, అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న దుర్గ గుడి ఈవో

దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి డి. భ్రమరాంబ కనకమహాలక్ష్మి అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి పూజ చేసిన అనంతరం ఆలయ అధికారులు ఆమెకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శిరీష, ఏఈవో వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రిమాండ్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ కేసు నిందితులు

ఆరిలోవ(విశాఖ తూర్పు): టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో నలుగురు నిందితులు విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. ఇటీవల వెలుగు చూసిన ఈ కుంభకోణానికి కారణమైన వారిని ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. వారిని ఇటీవల ఢిల్లీ నుంచి తీసుకొచ్చి మద్రిపాలెంలో ఈడీ కార్యాలయంలో విచారించారు. అనంతరం విశాఖ కోర్టులో హాజరుపరచగా.. 14 రోజులు రిమాండ్ విధించారు. ఆ నలుగురిని ఈ నెల 4న ఈడీ అధికారులు విశాఖ కేంద్ర కారాగారానికి తీసుకొచ్చారని జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ తెలిపారు.

ప్రస్తుతం వారంతా ఇక్కడ రిమాండ్‌లో ఉన్నారన్నారు. మళ్లీ ఈడీ అధికారులు కొద్ది రోజుల్లో విచారణ కోసం తీసుకెళ్లే అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు.

మైనార్టీలకు పెద్దపీట

- ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను గెలిపించుకుందాం
- ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

సీతంపేట (విశాఖ ఉత్తర): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో, వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫరూఖీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం వద్ద శుక్రవారం జరిగిన ముస్లిం మైనార్టీల ఆత్మీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. నాలుగేళ్లుగా అన్ని వర్గాల వారికి మేలు జరిగేలా గ్రామ, వార్డు స్థాయిలో ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. రాష్ట్రం పారిశ్రామికంగా అభివృద్ధి చెందేలా ఇటీవల నగరంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రపంచ స్థాయి వ్యాపారవేత్తలు పాల్గొని రూ.13లక్షల కోట్ల విలువైన పెట్టుబడుల ఒప్పందాలు చేసుకోవడం చాలా గొప్ప విషయమని తెలిపారు. విశాఖ పరిపాలనా రాజధాని అయితే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని, విశాఖ నుంచే త్వరలో పాలన కొనసాగించనున్నట్టు ఇటీవల ముఖ్యమంత్రి ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత రాజశేఖరరెడ్డి ఆరోజుల్లో ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించి దేశంలోనే చరిత్ర సృష్టించారన్నారు. ఆ మహానేత తనయుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకు వేసి ఉప ముఖ్యమంత్రిగా, శాసనమండలి ఉపాధ్యక్షురాలిగా ముస్లిం మహిళలను నియమించి పెద్దపీట వేశారన్నారు. వైఎస్సార్ కంటే రెండింతలు ఎక్కువగా ముస్లిం మైనార్టీలను గుండెల్లో పెట్టుకుని చూసుకునే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని 2024 ఎన్నికల్లో ఆశీర్వదించి తిరిగి సీఎంను చేయాలని కోరారు. ఈనెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఓటింగ్‌లో సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు , భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, మాజీ వుడా చైర్మన్ ఎస్.ఎ.రెహమాన్, ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామారావు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బర్కత్ ఆలీ, సాధిక్, ఇమ్రాన్, విశాఖ జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షులు కె.వి.బాబా, ముస్లిం సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.